ముందుకు సాగని పెద్దవాగు

- వాగులో దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు
- భారీ వర్షాలు కురిస్తే పట్టణంలోకి వరద
- మురుగు నిల్వతో దుర్వాసన
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మున్సిపాలిటీలోని పెద్దవాగు చిన్నబోతోంది.. ముళ్లపొదలతో అల్లుకుపోయి వరద ముందుకు సాగని స్థితికి చేరుతోంది. మురుగు నిల్వలతో దుర్వాస వెదజల్లుతోంది.. భారీ వర్షాలకు కాల నీలు ముంపునకు గురైన ఘటనను గుర్తు చేస్తోంది. పెద్దవాగు దుస్థితిని చూసి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పెద్దవాగులో దట్టంగా పెరిగిన ముళ్లపొదలను తొలగించి వరద సాఫీగా వెళ్లేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

– అయిజ



పెద్దవాగులో పెరిగిన ముళ్ల పొదలు

పట్టణంలోని పెద్దవాగులో ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. భారీ వర్షాలు కురిస్తే వాగులో వరద ముందుకు సాగక పట్టణం మునిగిపోయే ప్రమాదం నెలకొంది. 2009లో కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోకి నీరు చేరి కమంతంపేట, గుర్రంతోట, ఉప్పరపేట, అంబేడ్కర్ కాలనీ, ఎస్సీ కాలనీ, తెలుగుపేట, మాలపేట తదితర కాలనీలు మునిగిపోయాయి. ఆయా కాలనీల ప్రజలు ఊరిని ఖాళీ చేసి వివిధ గ్రామాల్లో తలదాచుకున్నారు. అప్పటి నుంచి అధికారులు రెండు, మూడేళ్లకోసారి పెద్ద వాగులో పెరిగిన ముళ్ల పొదలను తొలగిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని పాతబస్టాండ్– కొత్త బస్టాండ్ మధ్య వాగులో బ్రిడ్జికి ఇరువైపులా 200మీటర్ల మేర రూ.కోటి నిధులతో



వాగులో నిల్వ ఉన్న మురుగు

సీసీబెడ్ నిర్మించారు. అదేవిధంగా 18నెలల కిందట రూ.8లక్షలు వెచ్చించి వాగులో ముళ్లపొదలను తొలగించారు. ప్రస్తుతం వాగులో ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. మురుగునీటి నిల్వలతో వాగు పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. వాగుకు అకస్మాతుగా వరదలు వస్తే ముందుకు సాగని పరిస్థితి ఉంది. దీంతో పట్టణానికి వరద ముప్పు నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులో ముళ్లపొదలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం..

పెద్దవాగులో ముళ్లపొదల తొలగింపునకు చర్యలు చేపడుతాం. ఇప్పటికే పాత బస్టాండ్–కొత్త బస్టాండ్ ప్రాంతంలో 200 మీటర్ల మేర వాగుకు ఇరువైపులా సీసీబెడ్ ఏర్పాటు చేశాం. వరద ఎక్కువైతే పట్టణంలోకి నీళ్లు వచ్చే ప్రమాదం ఉంది. కౌన్సిల్ తీర్మాణం చేస్తే ముళ్ల పొదలను తొలగించే పనులను చేపడుతాం

– గోపాల్, మున్సిపల్ ఏఈ

ఎవరూ పట్టించుకోవడంలేదు..



పెద్దవాగును ఎవరూ పట్టించుకోవడంలేదు. వాగులో ముళ్లపొదలు దట్టంగా పెరగడంతో నీటి ప్రవాహం ముందుకు సాగని పరిస్థితి ఉంది. 13ఏళ్ల కిందట కురిసిన వర్షాలకు పట్టణంలోని వివిధ కాలనీలు నీటిలో మునిగిపోయాయి. రూ.కోట్ల నష్టం వాటిల్లింది.

– తిప్పారెడ్డి, అయిజ

ముళ్లపొదలను తొలగించాలి..



వాగులో ముళ్లపొదలు నీటి ప్రవాహానికి అడ్డుగోడలా మారాయి. ప్రతి సంవత్సరం ముళ్లపొదలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. భారీ వర్షాలు కురిస్తే పట్టణంలోని వివిధ కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

– ఖాజా, అయిజ

సగం ఊరు మునిగిపోయింది..



వాగులో ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. వాటిని తొలగించకపోతే పట్టణానికి వరద ముప్పు ఉంటుంది. 2019లో కురిసిన భారీ వర్షానికి వాగుకు ఉధృతంగా ప్రవాహం వచ్చింది. వాగులో ముళ్లపొదల కారణంగా వరద వివిధ కాలనీలను ముంచెత్తింది. ఇప్పుడు వాగులో ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. భారీ వర్షాలు కురిస్తే 14ఏళ్ల పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

– నాగరాజు, అయిజ

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



మానవపాడు: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. విద్యుత్ స్తంభం అడుగుభాగం నెర్రలు బారడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కేటీదొడ్డి: మండలంలోని గంగన్‌పల్లిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జిల్లా కో–కన్వీనర్ బండారి డేవిడ్, మండల ఇన్‌చార్జ్ జంబయ్య ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాధ్యక్షుడిగా గుడిసె కర్రెన్న, ఉపాధ్యక్షులుగా రంగన్న, పాపారాయుడు, ప్రధాన కార్యదర్శులుగా రంగన్న, చిన్న పొంటన్న, కార్యదర్శులుగా రూబెన్, జనార్దన్, సలహాదారుగా వెంకటేష్, గౌరవాధ్యక్షుడిగా నర్సింహులును ఎన్నుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న సప్తాహ భజనలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మల్లెందొడ్డి, మంగంపేట, బింగిదొడ్డి, చిన్న తాండ్రపాడు గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. భజన మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు దీరేంద్రదాస్, రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి పాల్గొన్నారు.

నెమలి అప్పగింత



గట్టు: మండలంలోని చాగదోన శివారులో గాయపడిన నెమలిని ఆదివారం గ్రామ యువకులు గుర్తించి స్థానిక పోలీసులకు అప్పగించారు. గ్రామశివారులో నెమలిని కుక్కలు వెంబడిస్తుండగా, యువకులు గమనించి రక్షించారు. కుక్కల దాడిలో నెమలికి గాయాలై అచేతన స్థితిలోకి చేరుకోగా.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నెమలికి వైద్యం చేయించిన అనంతరం అటవీశాఖ అధికారుల సమక్షంలో అడవిలో వదలనున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు.

‘నవ్వులే నవ్వులు’ పుస్తకావిష్కరణ



శాంతినగర్: మండల కేంద్రానికి చెందిన షేక్ అస్లాం షరీఫ్ రచించిన ‘నవ్వులే నవ్వులు’ పుస్తకాన్ని ఆదివారం అనంతపురంలో ప్రముఖ యూట్యూబర్ డాక్టర్ హరిప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్వు ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. అస్లాం రాసే జోక్స్ బాగుంటాయని, అతడు మరిన్ని రచనలను రచించాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో అబ్బా టీవీ కళాకారులు సుధాకర్, శ్రీనివాస్, సుబ్బు, రామచంద్ర, మస్తాన్ పాల్గొన్నారు.

చిన్నారుల సందడి



అలంపూర్ రూరల్: పట్టణంలోని చిన్న దర్గా సమీపంలో ఆదివారం చిన్నారులు పీరుతో సందడి చేశారు. చిన్నారులు ప్రత్యేకంగా పీరును తయారు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

రోడ్లకు నిధులు మంజూరు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలో నాగరాల, నాగసానిపల్లి గ్రామాల లింక్ రోడ్లకు నిధులు మంజూరైనట్లు ఎంపీపీ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సర్పంచులతో కలిసి ఆదివారం నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాగసానిపల్లి నుంచి శ్రీరంగాపురం వరకు బీటీ రోడ్డుకు రూ.1.30 కోట్లు, నాగరాల గ్రామం 2వ సెంటర్ నుంచి 3వ సెంటర్ వరకు బీటీ రోడ్డుకు రూ.1.25కోట్లు మంజూరైనట్లు తెలిపారు. శ్రీరంగాపురం మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ జగనాథం నాయుడు, సర్పంచులు ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, నిర్మల, కోఆప్షన్ సభ్యులు ఎండీ ఆరీఫ్, బీఆర్ఎస్ నాయకులు పృథ్వీరాజు, వెంకటస్వామి, రాధాకృష్ణ, మహేష్‌గౌడ్, కురుమయ్య ఉన్నారు.

చిన్నారులపై వీధి కుక్కల దాడి

పెబ్బేరు: మండల పరిధిలోని రంగాపూర్‌లో ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రంగాపూర్ గ్రామం ఎస్సీ కాలనీలో కావ్య, భాను, హర్షిత ముగ్గురు చిన్నారులు ఆదివారం సెలవు కావడంతో వీధిలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో వీధి కుక్కలు వచ్చి ఒకేసారి వారిపై దాడి చేసి గాయపర్చాయి. దీంతో ఎంపీటీసీ, సర్పంచ్ గట్టయ్య, పంచాయతీ కార్యదర్శి రాకేష్‌లకు ఈ విషయం తెలియడంతో వెంటనే చిన్నారులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామంలోని వీధి కుక్కలను పట్టుకుంటామని సర్పంచ్ తెలిపారు.

ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల మండలం పరమాలలో ఆదివారం సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు. అదేవిధంగా పార్టీ కార్యాలయంలో అంగన్‌వాడీలతో ఆశీర్వాద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీలను టీచర్లుగా మార్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీలు ఎమ్మెల్యే దంపతులను పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు చెన్నయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్, సర్పంచులు వాసు, మన్యం పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

అయిజ: పీఏసీఎస్ ద్వారా అందజేసే దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి రైతులకు సూచించారు. పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలను 50శాతం రికవరీ చేయకపోవడంతో 13ఏళ్ల నుంచి అయిజ సింగిల్ విండో రైతులకు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే అర్హతను కోల్పోయిందన్నారు. అయితే ఈ ఏడాది 67.5శాతం దీర్ఘకాలిక రుణాలను రైతుల నుంచి వసూలు చేసి.. రైతులకు దీర్ఘకాలిక రుణాలనిచ్చే అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా.. వాటిలో 15 సంఘాలు మాత్రమే దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే అర్హత కలిగి ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది మరో రెండు సంఘాలు అర్హత సాధించాయని, వాటిలో అయిజ పీఏసీఎస్ ఉందన్నారు. సొసైటీ ద్వారా గేదెలు, గొర్రెలు, చేపల పెంపకంతోపాటు వ్యవసాయ భూమి అభివృద్ధి పనులకోసం ఎకరాకు సుమారు రూ.5లక్షల వరకు రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అయితే రైతులు పంట భూమిని మార్టిగేజ్ చేయాల్సి ఉంటుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూలిన పైకప్పు.. తప్పిన ప్రమాదం

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పార్వతమ్మ మిద్దె ఆదివారం ఉదయం అకస్మాత్తుగా కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి మిద్దె పూర్తిగా తడిసిపోవడంతో ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు బయట ఉన్న సమయంలో ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, నిత్యవసర సరుకులు, బట్టలు పూర్తిగా నాశనమయ్యాయి. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భీంరెడ్డికి విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే గృహలక్ష్మి పథకంలో ఇల్లు మంజూరు చేద్దామని భరోసా ఇచ్చినట్లు భీంరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశంతో కూలిపోయిన ఇంటిని బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఆమె భర్త ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆమె



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

ఇప్పుడు కుమారుడు భరత్, కూతుళ్లు అంజలి, మనీషాలతో ఉంటోంది. ఒక్క నిమిషం ఇంట్లో నుంచి వారు బయటకు రాకుంటే అందరూ సజీవ సమాధి అయ్యేవారని స్థానికులు పేర్కొన్నారు. ఇల్లు పరిశీలించిన వారిలో యుగంధర్‌రెడ్డి, జగదీష్, ఉపసర్పంచ్ శివప్రసాద్, శ్రీనివాసులు, కృష్ణయ్య, రైతుబంధు కో ఆర్డినేటర్, భరత్‌యాదవ్. ఫీల్డ్ అసిస్టెంట్ సీత మొగులన్న, అబీబ్ ఉన్నారు.

గుంతలు పూడ్చిన ట్రాఫిక్ కానిస్టేబుల్

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై ఏర్పడిన చిన్నపాటి గుంతల వల్ల వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించిన ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ స్వయంగా వాటిని పూడ్చారు. వివరాల్లోకి వెళితే భూత్పూర్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లేదారి గుంతలు పడటంతో అక్కడ విధుల్లో ఉన్న మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సుధాకర్‌గౌడ్ అనే కానిస్టేబుల్ గుర్తించారు. స్వయంగా మట్టిని తీసుకువచ్చి గుంతలు పూడ్చేశారు. ట్రాఫిక్ తక్కువగా ఉన్న సమయంలో పనులు చేపట్టినట్లు ‘సాక్షి’కి తెలిపారు.



మట్టితో గుంతలు పూడుస్తున్న కానిస్టేబుల్

బ్రాహ్మణ సేవావాహిని కార్డుల పంపిణీ



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఎన్‌టీఆర్ కల్యాణ మండపం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో ఆదివారం బ్రాహ్మణసేవా వాహిని గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణసేవా వాహిని రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు మాట్లాడుతూ బెస్ట్‌స్కీంలో బ్రాహ్మణులకు స్వయం ఉపాధి కింద రూ.5లక్షల రుణాలు అందజేస్తారని, బ్రాహ్మణ సేవా పరిషత్ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 60 ఏళ్లపైబడిన వేదపండితులకు నెలకు రూ.5వేలు భత్యం అందజేస్తారని, వీటి దరఖాస్తులను కూడా తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శేషం రఘు కిరణాచార్యులు, జిల్లా అధ్యక్షుడు కరణం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీనాథ్‌కు సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి మందా శ్రీనాథ్‌ను ఆదివారం స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. మానవపాడు మండలంలోని శ్రీనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కొండేరులో శ్రీనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఏకాంత్, వీరన్న, సత్యం, తిమ్ములు, బీచుపల్లి పాల్గొన్నారు.

ప్రతిభ చాటాలి

అయిజ: తైక్వాండో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ప్రతిభ చాటాలని ఎస్ఐ నరేష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం తైక్వాండో విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులు ప్రదానం చేశారు. మాస్టర్ షేక్షావలి ఆచారి, శిక్షకులు జమీర్, ప్రదీప్‌సాగర్ పాల్గొన్నారు.

‘రైతులపై కేసులు సరికాదు’

గట్టు: భూమి, భుక్తి కోసం శాంతియుత మార్గంలో పోరాటం చేస్తున్న చిన్నోనిపల్లె నిర్వాసిత రైతులపై పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం సరికాదని తీన్మార్ మల్లన్న టీం జిల్లా కోఆర్డినేటర్ కొమ్ముల ప్రవీణ్‌రాజ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలని ఏడాది కాలంగా శాంతియుతంగా నిరసన తెలియజేసిన రైతులపై కేసులు నమోదు చేయించడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. యాసిడ్ దాడుల సందర్భంలో ఉపయోగించే సెక్షన్ల కింద రైతులపై కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. రైతులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం ఎర్రవల్లి–గద్వాల రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన కుమార్ తన భార్య లక్ష్మితో కలిసి ద్విచక్ర వాహనంపై గద్వాలకు వచ్చి.. తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. నంది గోశాల సమీపంలో బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూల్‌కు తరలించారు. లక్ష్మి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలియజేసినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

‘గృహలక్ష్మి’కి భారీగా దరఖాస్తులు

అలంపూర్ రూరల్: గృహలక్ష్మి పథకానికి ఆదివారం భారీగా దరఖాస్తులు వచ్చాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి 39 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు.

కేటీదొడ్డి: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోడానికి మండల పరిషత్ కార్యాలయానికి ప్రజలు పోటెత్తారు. ఇప్పటి వరకు 3,118 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ అజార్ మొహినుద్దీన్ అజార్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను జెడ్పీటీసీ రాజశేఖర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ సయ్యద్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ అశోక్, జూనియర్ అసిస్టెంట్ సలీం పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

చేనేత కార్మికులు సంఘటితం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న దోమ వీరన్న

గట్టు: చేనేత కార్మికులు సంఘటితం కావాల్సిన అవసరం ఉందని చేనేత సంఘం పర్సన్ ఇన్‌చార్జ్, ఆప్కో మాజీ డైరెక్టర్ దోమ వీరన్న అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన చేనేత కార్మికుల, కళాకారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సంఘం కార్యాలయం వద్ద జెండావిష్కరణ చేశారు. అనంతరం నేతాజీ చౌక్ మీదుగా సంతబజారు వరకు ర్యాలీ నిర్వహించారు. చేనేత కళాకారులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దోమ వీరన్న మాట్లాడుతూ చేనేత కుటుంబాలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరగిద్ద చేనేత సహకార సంఘం అధ్యక్షుడు నర్సప్ప, గొర్లఖాన్‌దొడ్డి చేనేత సంఘం అధ్యక్షుడు సిద్దిరామప్ప, మాచర్ల అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు జయన్న, గోవిందు, నర్సన్న, తిమ్మప్ప, చంద్రశేఖర్, నాగరాజు, జయరాములు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వసతులు ఏర్పాటు చేయండి

అయిజ: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 గ్రామాలకు ఒకటే అంబులెన్స్ ఉందని, మందుల కొరత నెలకొందని తెలిపారు. ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ లేకుండానే కాన్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీకి శాశ్వత మెడికల్ ఆఫీసర్, గైనకాలజిస్టును నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుమలేష్, నర్సన్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్

బహుజన రాజ్యం కోసం పోరాడుదాం



జెండాను ఎగురవేస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్ రూరల్: బహుజన రాజ్యం కోసం అందరం కలిసి పోరాడుదామని బీఎస్పీ మండల అధ్యక్షుడు సురేష్ అన్నారు. మండలంలోని కాశీపూర్‌లో ఆదివారం బీఎస్పీ జెండాపండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో బీఎస్పీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రెపల్లే రాజు, బాబు, నాగరాజు, సునీల్, రమేష్, ప్రవీణ్‌కుమార్, కుమార్ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మదనాపురం: సంచార జీవితం, కాయకష్టంతో బతుకుతున్న వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆదివారం వడ్డెరలు డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆదివారం వనపర్తిలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి మదనాపురం మండల కేంద్రం నుంచి వడ్డెర కులస్తులు తరలి వెళ్లారు. అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వడ్డె కృష్ణ, వడ్డె బాలు, సాంతన్న, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

అమరచింత: పట్టణంలోని పలు వార్డుల్లో నిండుకున్న మురుగు కాల్వలను సంబంధిత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా వార్డుల ప్రజలు పేర్కొన్నారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద పెరిగిందని తెలిపారు. మురుగు కాల్వలను శుభ్రం చేయాలని సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకొని మురుగు కాల్వలను శుభ్రం చేయించాలనికోరుతున్నారు.

బాధితురాలికి ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో మంగళి శారదమ్మ మట్టిమిద్దె ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న తూడి మేఘారెడ్డి రూ.5వేల ఆర్థికసాయం పంపించగా, ఆదివారం యువసేన నాయకులు బాధితురాలికి అందజేశారు.